విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 22: విద్యార్థులు కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఈగల్ కుంగ్‌ఫూ మార్షల్‌ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, నాయకుడు దేవందర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తప్పకుండా మార్షల్ ఆర్ట్స్ వంటి యుద్ధ విద్యను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కరాటే, మార్షల్‌ఆర్ట్స్ నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, నాయకులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గూడూరు పంచాయతీలో పెద్దగుట్ట తండాను కలుపాల్సిందే

కొత్తూరు, సెప్టెంబర్ 22: గూడూరు గ్రామ పంచాయతీలో పెద్దగుట్ట తండాను కలుపాల్సిందని ఎమ్మెల్యే శంకర్‌కు గూడూరు గ్రామస్తులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దగుట్ట తండా ప్రజలు తమను గూడూరు పంచాయతీలో కలుపాలని గూడూరుకు చెందిన కొంత మంది వద్ద సంతకాలు తీసుకున్నారని చెప్పారు. కానీ తమ గ్రామ పంచాయతీలో ఉన్న మక్తగూడ, పెద్దగుట్ట తండాను వేరుచేసి మక్తగూడ పంచాయతీగా ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే పెద్దగుట్ట తండా వాసులు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అంతేకాకుండా మక్తగూడ నుంచి పెద్దగుట్ట తండాకు లింకు రోడ్డును నిర్మించాలని చెప్పారు. తమ పంచాయతీలో అధిక జనాభా ఉందని, కావున మరో గ్రామాన్ని తమ పంచాయతీలో కలుపాల్సిందని ఎమ్మెల్యేకు విన్నవించారు. వీరి వెంట సత్తయ్య, ఉప్పల దయానంద్, సురేశ్, పద్మారావు, రమేశ్, అశోక్, మల్లేశ్, శివరాజు, చంద్రయ్య, వెంకటేశ్, రాజు, శ్రీశైలం, మహేందర్‌రెడ్డి, నారాయణ, జ్ఞానేశ్వర్, రవి, లింగం, యాదయ్య, సుధాకర్, రాఘవేందర్, వంశీ, నరేశ్, సలీం, జంగయ్య, గోపాల్ పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యం

మాసబ్ చెరువు వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 22 : పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది మాసబ్ చెరువులో చెత్త, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు కొనసాగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పట్టణాన్ని స్వచ్ఛతలో ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీశ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 22 : చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లి రెవెన్యూ పరిధిలోని ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో టీం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ ఫౌండేషన్ సహకారంలో ఆదివారం ఉచిత జీర్ణ వ్యవస్థ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల జీర్ణ వ్యవస్థను నిర్ధారించే పరీక్షలు అల్ట్రా సౌండ్, ఎండో స్కోపి, ప్రోక్టో స్కోపి, లివర్ ఫంక్షన్ టెస్ట్, సీబీపీ, బిపిడ్ ప్రొఫైల్, హెపటైటిస్ బీ అండ్ సీ, వైరల్ స్క్రీనింగ్, గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డీఏకో తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 300 మందికి పైగా పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విమలా కర్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, రోహన్ రెడ్డి, గౌరాంగ్, మహేశ్ పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ విడుదల

మంచాల, సెప్టెంబర్ 22: తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆదివారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ ఈ నెల 25న ఇబ్రహీంపట్నంలో జరిగే మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర సదస్సుకు మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గౌరవ సలహాదారులు కృష్ణ, సంఘం నాయకులు చంద్రయ్య, పాండు, కృష్ణ, మల్లేశ్, రామకృష్ణ, సత్యనారాయణ, నర్సింహ పాల్గొన్నారు.

అర్హులందరికీ గ్యాస్ సిలిండర్

ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేస్తున్న మాజీ సర్పంచ్

మంచాల, సెప్టెంబర్ 22 : మహాలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైనవారందరికీ రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం అందజేస్తుందని మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండలం చీదేడు గ్రామంలో లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, యాదయ్య, మహేందర్, శివ పాల్గొన్నారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

బీఆర్ఎస్ కడ్తాల్ పట్టణ నూతన అధ్యక్షుడు కడారి రామకృష్ణను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, సెప్టెంబర్ 22: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ కడ్తాల్ పట్టణ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కడారి రామకృష్ణను ఆదివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. సమస్యలపై ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పేదలకు సంక్షేమ పథకాలు అందలేదని పేర్కొన్నారు. పింఛన్ రూ.4,000, కల్యాణలక్ష్మి తులం బంగారం, రైతు భరోసా, రుణమాఫీ ఎక్కడికి పోయిందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ బూటకపు హామీలను ప్రతి కార్యకర్త ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

పరామర్శ..

మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు వరికుప్పల వెంకటయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రూ.10వేలు, స్థానిక నాయకులు రూ.35వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పంతూనాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయక్, నాయకులు బాబా, జగన్, శంకర్ ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలి...

కడ్తాల్ నుంచి చల్లంపల్లి గ్రామం మీదుగా పడకల్ గేట్ వరకు చేపట్టిన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19.95 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీటీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం చల్లంపల్లి పల్లె దవాఖానను ఆయన సందర్శించారు. అది మూసి ఉండటంతో ఆయన విచారం వ్యక్తం చేశారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని వైద్య శాఖ ఉన్నతాధికారులకు ఫోన్లో ఆయన సూచించారు.

ఆమనగల్లు : సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

షాబాద్‌లో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ఆమనగల్లు, సెప్టెంబర్ 22 : విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ప్రజ్ఞ ఉన్నత పాఠశాలకు చెందిన 1994-1995 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, మదన్మోహన్, ఉమారాణి, శాస్త్రి, వెంకటచారిలను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీతయ్య, విజయ్‌మోహన్, శివప్రసాద్, శ్రీను, సంతోశ్‌కుమార్, లావణ్య, వినీల తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

షాబాద్ : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. షాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం షాబాద్‌లోని ఓ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు వెంకట్‌యాదవ్, సత్యనారాయణ, వెంకటస్వామి, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

మండల కేంద్రంలోని షాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యను బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

షాబాద్ : సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

మద్యపాన నిషేధంపై యువకుడి నిరాహారదీక్ష

నిరాహారదీక్ష చేపట్టిన యువకుడికి మద్దతు తెలుపుతున్న స్థానికులు

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 22 : ఫరూఖ్‌నగర్ మండలంలోని కిషన్‌నగర్ గ్రామంలో ఎంతో మంది మద్యానికి బానిసై మృతిచెందారని, చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయని గ్రామానికి చెందిన శేఖర్ విచారం వ్యక్తం చేస్తూ మద్యపాన నిషేధంపై రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ గ్రామంలో విచ్చలవిడిగా మద్యం విక్రయించడంతో మద్యానికి బానిసై ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, మద్యపాన నిషేధం జరిగే వరకూ తాను రిలే నిరాహార దీక్షను కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మాసబ్ చెరువులో చేపల వేట

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 22 : గత బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో రాష్ట్రంలోని చెరువుల్లో పూడిక తీత వలన చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు అలుగు పారుతున్నది. దీంతో మాసబ్ చెరువు అలుగులో పెద్ద ఎత్తున్న చేపలు ఎదురెక్కుతూ వస్తుండడంతో యువకులంతా వరదలో చేపల వేట సాగిస్తున్నారు. ఆదివారం సెలువుదినం కావడంతో ఉత్సాహంగా వలలతో చేపలు పట్టారు.

సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 22 : 1999-2000 సంవత్సరంలో దేవునిఎర్రవల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం చేవెళ్ల మండలంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించి పాత తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించండి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబర్ 22 : మండల పరిధిలోని మంగళపల్లి గ్రామ పంచాయతీ -చెన్నారం రోడ్డు మధ్యలో ఉన్న వాగు వద్ద వంతెన నిర్మించాలని ఆదివారం మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వానకాలంలో రాకపోకలకు మంగళపల్లి, చెన్నారం ప్రజలకు ఇబ్బందులు పడుతున్నట్లు విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 22 : చేవెళ్లలో నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు. మండల పరిధి రావులపల్లి మాజీ సర్పంచ్‌లు గోటూరి రామచంద్రయ్యగౌడ్ రూ.లక్షా 5వేలు, కేసారం శ్రీనివాస్ రూ.51 వేలు, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ రూ.13,999లను ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆలయక కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల కురుమ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కడ్తాల్, సెప్టెంబర్ 22: అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు గోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రావిచేడ్ గ్రామంలో వ్యవసాయానికి 24 గంటల త్రీఫేస్ కరెంట్ సరఫరా లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ సమస్యపై గతంలో మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు లేవనెత్తినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో రైతులు పడుతున్న కష్టాల గురించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు విన్నవించగా, వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వ్యవసాయానికి నవంబర్ నెల నుంచి త్రీఫేస్ కరెంట్ సరఫరా కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయంలో పూజలు

ఆమనగల్లు, సెప్టెంబర్ 22: పట్టణంలోని మద్దెలమ్మా కాత్యాయని మహాదేవి ఆలయంలో ఆదివారం మండల పద్మశాలీ సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, నాయకులు శ్రీను, సత్యరాములు, అశోక్, ఈశ్వరయ్య, ప్రవీణ్, రమేశ్, మధుసూదన్, వాసు, రాఘవ, రఘు, శ్రీను, నిరంజన్, రవి, రవి, అప్పి, వెంకటేశ్, భాస్కర్, ప్రవీణ్, బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌ను జయప్రదం చేయాలి

షాబాద్, సెప్టెంబర్ 22: ఈ నెల 23, 24వ తేదీల్లో తుక్కుగూడ, శంషాబాద్‌లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్రస్థాయి సెమినార్ సమావేశాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే సెమినార్‌కు మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు హాజరవుతున్నారన్నారు. ఈ సెమినార్‌లో మన ఆర్థిక విధానం ప్రజల కోసమా.. లాభాల కోసమా... అనే అంశంపై ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు విశ్లేషిస్తారని, మంగళవారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం శంషాబాద్ పట్టణ కేంద్రంలో జరుగుతుందని, ఇందులో కార్మికుల భద్రత, హక్కుల కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అర్ధ శతాబ్ది ఉత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 22: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 23 వరకు జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభ వాల్ పోస్టర్లను చేవెళ్ల మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ఎదుట ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జైపాల్, సహాయ కార్యదర్శి ప్రభాస్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడ్తాల్, సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ కార్యకర్త పరికుప్పల మహేశ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ, యువజన సంఘాల నాయకులు మహేశ్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5వేల చొప్పున రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే సాలార్‌పూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వెంకటయ్య కుటుంబానికి రాధాకృష్ణ ట్రస్ట్ తరుపున రూ.5వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు భీక్యానాయక్, జగన్‌యాదవ్, వెంకటేశ్, మహేశ్, జంగయ్యయాదవ్, శ్రీనివాస్, మల్లేశ్ ఉన్నారు.

బస్సు ఢీకొని మహిళ..

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 22: అబ్దుల్లాపూర్‌మెట్‌లో జాతీయ రహదారి దాటుతూ బస్సు ఢీకొని ఓ గుర్తు తెలియని మహిళ మృతిచెందింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి గండిమైసమ్మ ఆలయ సమీపంలో దాదాపు 45 నుంచి 50 ఏండ్ల వయసున్న ఓ మహిళ రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ వైపు అతివేగంగా వెళ్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలిని యాచకురాలిగా భావిస్తున్నారు. 100 డయల్ ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని.. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మరొకరు..

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 22 : మొక్కజొన్న పంటలో అడవి పందుల బెడద నివారణకు వేసిన కరెంట్ వైర్లకు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సంతోశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊరెళ్ల గ్రామానికి చెందిన నల్లొల్ల రాజు(35) కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం అదే గ్రామం ఊరెళ్ల కిష్టయ్యకు చెందిన మొక్కజొన్న పంట పొలంలో అడవి పందుల బెడద నివారణకు వేసిన కరెంట్ వైర్లకు తగిలి నల్లొల్ల రాజు మృతి చెందినట్లు సమాచారం అందడంతో మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హామీలు నెరవేర్చాలి

ఆర్కేపురం, సెప్టెంబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోరాటం చేస్తామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్ అన్నారు. ఆదివారం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో సీపీఎం 5వ మహాసభ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీపీఎం జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్ నగర్ సీపీఎం కార్యదర్శిగా గోపీనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కీసరి నర్సిరెడ్డి, వెంకన్న, కట్ట శ్రీనివాస్, వీరయ్య, రాజు, పద్మ, వెంకన్న, రాంచందర్ పాల్గొన్నారు.